## క్లుప్తంగా

### దరఖాస్తు చేసుకోవాలి

తొర్రూరు: ఈ-శ్రమ్ కార్డు లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రమాద బీమాకు దరఖాస్తు చేసుకోవాలని తొర్రూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.రవి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని లేబర్ కార్యాలయంలో ప్రమాద బీమా దరఖాస్తు వివరాలను మంగళవారం వెల్లడించారు. ఈశ్రమ్ కార్డు ఉన్న అసంఘటిత రంగ కార్మికులు ఈనెల 31 వరకు కేంద్ర ప్రభుత్వ ప్రమాద బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు తొర్రూరులోని లేబర్ ఆఫీస్‌లో అందించాలన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.2లక్షలు, శాశ్వత వైకల్యం సంభవిస్తే రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా అందుతుందన్నారు.

### డాక్టరేట్ ప్రదానం



గార్ల: గార్ల డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ హిస్టరీ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎస్‌కె అజిత్‌కు జార్ఖండ్ రాష్ట్రంలోని రాధా గోవిందా యూనివర్సిటీ డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసింది. హిస్టరీ విభాగంలో బ్రిజోనందస్ చౌదరి పర్యవేక్షణలో 'స్వాతంత్ర్యానికి ముందు తర్వాత వ్యవసాయ పద్ధతుల్లో అభివృద్ధి' అనే అంశంలో పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేసింది.

### పద్ధతి మార్చుకోవాలి



తొర్రూరు: రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోవాలని సీఐ కె.జగదీష్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సైలు పిల్లల రాజు, రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

### వాహనాల తనిఖీ

కురవి: మండల కేంద్రంలోని 365 జాతీయ రహదారిపై మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో సీఐ సర్వయ్య, కురవి ఎస్సై బైరు గోపి, ఏఎస్సైలు జి.వెంకన్న, సదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### సన్మార్గంలో పయనించాలి

గార్ల: యువత చెడు వ్యసనాలను వీడి, సన్మార్గంలో పయనించాలని ఎస్సై జీనత్‌కుమార్ సూచించారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లోకేష్, ప్రిన్సిపాల్ రాజకుమారి, కట్టెబోయిన శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మండల కమిటీ ఎన్నిక



విద్యాసాగర్, అధ్యక్షుడు

కురవి: సీరోలు మండల టీపీటీఎఫ్ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బొల్లం శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా సజ్జనము విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా బాబురావును ఎన్నుకున్నారు.

### సమరయోధుల యాదిలో..



కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో స్వాతంత్ర్య సమరయోధుల యాదిలో అనే వినూత్న కార్యక్రమాన్ని మంగళవారం హెచ్‌ఎం రాజు ఆధ్వర్యంలో ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు చూపుతూ వారి జీవిత చరిత్రను, దేశానికి చేసిన సేవలను వివరించారు.

### పథకాలపై కళాప్రదర్శన

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై మంగళవారం కళాకారులు కళాప్రదర్శన, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు రవీందర్‌గౌడ్, సత్యనారాయణ, యుగేందర్, నరేష్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

# కొరిపల్లి.. సమస్యల లొల్లి

- గ్రామానికి బస్సు సౌకర్యం లేదు
- డ్రెయినేజీ లేక రోడ్డుపై పారుతున్న మురుగు నీరు
- మండల కేంద్రానికి కూత వేటు దూరంలో గ్రామం..

పెద్దవంగర: మారుమూల గ్రామాలకు బీటీ రోడ్డు సదుపాయం ఉన్నా చిరకాల స్వప్నం సాకారం కావటం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. కానీ మండలంలోని కొరిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. దీంతోపాటు అనేక సమస్యలు వెక్కిరిస్తున్నాయి. మురుగు కాల్వల నిర్మాణం లేకపోవడంతో గ్రామంలో రోడ్లపైనే మురుగునీరు పారుతుంది. దీంతో దుర్వాసన వెదజల్లుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారులు, జీపీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

**2,472మందికి పైగా జనాభా**

గ్రామంలో 2,472 మంది జనాభా, 415 కుటుంబాలు, 8వార్డులు ఉన్నాయి. 8, 3వార్డుల్లో సైడ్ కాల్వలు మాత్రమే ఉన్నాయి. మిషన్ భగీరథ పథకంలో భాగంగా తాగు నీటి ట్యాంకును నిర్మించినప్పటికీ గ్రామంలో పలు ఇళ్లలోకి తాగునీటి కనెక్షన్ ఇవ్వలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న కొరిపల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు రాకపోవడంతో తిరుమలగిరి-తొర్రూరు ప్రధాన రహదారి వద్దకు 2కిలోమీటర్ల మేర కాలినడక, ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. కొరిపల్లి చెరువు మీదుగా రంగాపురం బీటీ రోడ్డు వేసినప్పటికీ చెరువు రెండు అలుగుల వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వదిలేశారు. అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వీధుల్లో పారుతున్న మురుగు నీరు



చెత్తతో నిండిన సైడ్‌కాల్వ

### డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి



గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టకపోవడంతో రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. వానాకాలం కావడంతో రోడ్డుపై నడవాలంటే ఇబ్బందిగా ఉంది. వర్షాకాలం కావడంతో జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మాణాలు చేపట్టే విధంగా అధికారులు చొరవ చూపాలి. గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలి.

– అనిఫా బేగం, కొరిపల్లి

### బస్సులు రాక ఇబ్బందులు



అనారోగ్యం పాలైనా, అత్యవసర పరిస్థితుల్లోనూ తొర్రూరు పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి. కానీ ఎక్కడికి వెళ్లాలన్నా మా ఊరి నుంచి ఆటోల్లోనే ప్రయాణించాలి. ఆటోల్లో వెళ్లాలంటే గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మా గ్రామానికి బస్సులు నడిపితే విద్యార్థులు, గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. బస్సులు నడపాలని అధికారులను కోరుతున్నాం.

– అరుట్ల వెంకట్‌రెడ్డి, కొరిపల్లి

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 103 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు, రైతుబంధు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. నియోజవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇక్కడ ప్రభుత్వ భూమిలేదంటూ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు పేర్కొనడం, స్థలం కేటాయించకపోవటం వల్ల గిరిజన యూనివర్సిటీ ములుగుకు వెళ్లిపోయిందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రామిరెడ్డి, ఖలీల్, శ్రీనివాస్, పద్మం ప్రవీణ్ కుమార్, బొల్లు రాజు, వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసింహారావు, శ్రీను, అరుణ్ నాయక్, రియాజ్ అన్సారీ, కౌన్సిలర్లు శ్రీను, పోతురాజు రాజు, వెంకన్న, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఎంఆర్ఐ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు

### జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

నెహ్రూసెంటర్: జిల్లా సమగ్రాభివృద్ధి కోసం కృషి చేయాలని ఎంపీ బలరాంనాయక్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి కోరారు. ఈమేరకు ఎంపీని మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

### ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్: గ్యాస్ సిలిండర్లను వినియోగించే సమయంలో సంభవించే ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని డోర్నకల్ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ వీరేషం సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు రాజుతండాలో మంగళవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

మరిపెడ: మండలంలోని ఎల్లంపేట రెవెన్యూ పరిధిలోని భూక్యతండా గ్రామ పంచాయతీకి చెందిన రేషన్ డీలర్ భూక్య శ్రీనివాస్ ఏడాదిన్నర క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సెల్‌ఫోన్ దొంగిలించిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై సంతోష్ మంగళవారం బాధితుడికి ఫోన్ అందజేశారు.

# నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలో నిధుల దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో నెలకొన్న సమస్యలను, బిల్లుల చెల్లింపులో జాప్యం, ఇష్టారాజ్యంగా బిల్లుల చెల్లింపు తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కొన్ని వస్తువుల కొనుగోలుకు సంబంధించి అధిక చెల్లింపులు చేశారని కౌన్సిలర్ సురేందర్‌జైన్ ఆరోపించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కనిపించడం లేదని పాలకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కమిషనర్ నరేష్‌రెడ్డి, ఏఈ బాబు పాల్గొన్నారు.

# ఎఫ్‌ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



తొర్రూరు: వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్‌ఏలు

తొర్రూరు: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని నియోజకవర్గ ఫీల్డ్ అసిస్టెంట్లు అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారం కోరుతూ నియోజకవర్గ ఎఫ్‌ఏలు డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పేస్కేలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాల్నె సతీష్, వీరాంజనేయులు, సాలయ్య, బండి దేవేందర్, యాకయ్య, హరీశ్, సోమలక్ష్మి, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

నర్సింహులపేట: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం జిల్లా కార్యదర్శి పేరునాకి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎఫ్‌ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు తూడి మాణిక్యం, లింగయ్య, శంకర్, వీరన్న పాల్గొన్నారు.

# ప్రతిభను వెలికితీసేందుకే క్విజ్‌పోటీలు



మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్విజ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని ప్రభుత్వ బాలికల పాఠశాల హెచ్‌ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులకు టీబీ, రక్తదానంపై జిల్లాస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. క్విజ్ పోటీల ద్వారా విద్యార్థులకు సమయపాలనపై సరైన స్పష్టత వస్తుందన్నారు. గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ జ్యోతి, శాంతరాజు, ఉపాధ్యాయులు గిరిజ, శ్వేత పాల్గొన్నారు.

## వైద్యశిబిరాలు



కేసముద్రం: పరీక్షలు చేస్తున్న వైద్యులు

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో గల ఎస్సీ కాలనీలో మంగళవారం ఇనుగుర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణమూర్తి, శ్రీనివాస్, హేమలత పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: మండలంలోని ఖానాపురం గ్రామంలో గుర్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రూప, మాంత్య, శ్రీనివాస్, రామాంజలిదేవి, సునీత పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో జన వికాస సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి ప్రవీణ్, సూపర్‌వైజర్ రాధాకుమారి, సుమలత, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

# దేశభక్తిని పెంపొందించుకోవాలి



మహబూబాబాద్ అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు



పెద్దవంగర: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు




డోర్నకల్‌లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ..

మహబూబాబాద్ అర్బన్: హర్ ఘర్ తిరంగాతో దేశ ఐక్యతను చాటుదామని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ మదన్ నాయక్ అన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యాప సీతయ్య, సీనియర్ నాయకులు శ్యామ్‌సుందర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళీ, పార్లమెంట్ కన్వీనర్ సతీష్, అధికార ప్రతినిధి ఇందుభారతి పాల్గొన్నారు.

పెద్దవంగర: జాతీయ భావాలు పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు మెరుగు సందీప్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకుడు ముఖేష్, బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్, నాయకులు కాజు భాస్కర్ చారి, ఆనంద్, శంకర్ పాల్గొన్నారు.

తొర్రూరు: ప్రతీ ఒక్కరూ దేశభక్తి భావనను పెంపొందించుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తూర్పాటి సాయిముఖేష్ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం డివిజన్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొలుపుల శంకర్, బీజేపీ అర్బన్, రూరల్ అధ్యక్షుడు అలిసేరి రవిబాబు, కస్తూరి పులేందర్, నాయకులు పాల్గొన్నారు.

డోర్నకల్: డోర్నకల్‌లోని పలు వీధుల్లో మంగళవారం బీజేపీ మైనారిటీ మోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రెహమాన్, నాయకులు లక్ష్మీనారాయణ, మహ్మద్ గఫూర్ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి**

డోర్నకల్: స్థానిక మైనారిటీ గురుకుల బాలికల కళాశాల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె రెహమాన్ కోరారు. మైనారిటీ గురుకుల బాలికల కళాశాల హాస్టల్‌ను మంగళవారం బీజేపీతోపాటు మైనారిటీ మోర్చా నాయకులు సందర్శించి ప్రిన్సిపాల్ రాజమణితో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గణేష్‌నాయక్, లక్ష్మీనారాయణ, దేవానాయక్ పాల్గొన్నారు.

**సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయాలి**

తొర్రూరు రూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమారపు ఐలయ్య కోరారు. కోర్టు తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన విజయోత్సవ ర్యాలీకి మంగళవారం బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, బుచ్చయ్య, యాకమల్లు, ఉపేందర్, వెంకన్న పాల్గొన్నారు.

**విరాళాల సేకరణ**

తొర్రూరు: కేరళ వరద బాధితుల కోసం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్, నాయకులు శ్రీను, యాకయ్య, వెంకట్‌రెడ్డి, సారయ్య పాల్గొన్నారు.

**పట్టుదలతో చదవాలి**

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు కష్టపడి పట్టుదలతో చదవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రైబల్ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం స్పోర్ట్స్ మెటీరియల్‌ను వెంకన్న విద్యార్థులకు అందజేశారు.

**కరపత్రాల ఆవిష్కరణ**

తొర్రూరు: ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న కోరారు. హామీల అమలు కోరుతూ ఈనెల 22న మాస్‌లైన్ ఆధ్వర్యంలో చేపట్టే 'చలో హైదరాబాద్' కరపత్రాలను మంగళవారం డివిజన్ కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, సాయిలు, మధు, వెంకన్న, ఐలయ్య పాల్గొన్నారు.

**కలెక్టర్‌కు వినతి**

మహబూబాబాద్: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతీయుల సమస్యలు పరిష్కరించాలని సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సత్యమనోరమ్మ, సదానందం, హరికిషన్, రాజేశ్ పాల్గొన్నారు.

**టై, బెల్టుల పంపిణీ**

మహబూబాబాద్ రూరల్: యూఎస్ఏ తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని కంబాలపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టీ షర్టులు, టై బెల్టులు, విద్యా సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు లక్ష్మి, రమేష్ బాబు, సొసైటీ అధ్యక్షుడు, ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, సభ్యులు పాల్గొన్నారు.

**ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో..**

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఇదే గ్రామానికి చెందిన ఏసీఎఫ్ అప్పయ్య పంపించిన రూ.30వేల విలువైన టై, బెల్టులు, ఐడీ కార్డులు, షూస్ తన తండ్రి కట్టయ్య మంగళవారం విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం విజయసుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**రైతులకు అవగాహన**

గార్ల: మొక్కజొన్న పంటలో రైతుల తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు అవగాహన కల్పించారు. మంగళవారం ముల్కనూరు పంచాయతీలో రైతు మొక్కజొన్న పంటలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

**రుణమాఫీ చేయాలని వినతి**

కురవి: రూ.2లక్షల రుణమాఫీలో భాగంగా రేషన్ కార్డు లింకు లేకుండా బ్యాంకులో రుణం తీసుకున్న ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని సీపీఎం మండల నాయకుడు తగరం తిరుపతి అన్నారు. మంగళవారం సీరోలు మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు.

**గంగారం చేరుకున్న యాత్ర**

గంగారం: ఇల్లెందుకు చెందిన ఆదీమ్ హజ్‌యాత్ర దాదాపుగా 9వేల కిలోమీటర్ల పాదయాత్ర ఈనెల 12వ తేదీన ప్రారంభించాడు. మంగళవారం యాత్ర గంగారం చేరుకోగా.. ఆదీమ్‌ను మైనార్టీ సంఘం జిల్లా ముఖ్య కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ నబీ శాలువాతో సన్మానించి, అల్పాహారం అందించారు.

**స్టడీ మెటీరియల్ పంపిణీ**

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కొమ్ము గూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్థానిక యువకుడు నరేష్ మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశాడు.

**అవయవదానానికి ముందుకు రావాలి**

కురవి: ప్రతీ ఒక్కరు అవయవదానానికి ముందుకు రావాలని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రపంచ అవయవ దాన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవరశెట్టి మల్సూర్, కుమారస్వామి, గణేశ్, రామరావు, రాములు, నాయక్, కిషన్ పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులకు సన్మానం**

కురవి: మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు కాశీనాథ్, కిషన్, పూలరాజు, సునీత, జ్యోత్స్న, గౌస్‌లను మంగళవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణచారి, శ్రీరాములు, లలిత, దీపిక, ఇందిర పాల్గొన్నారు.

**పాఠశాలలో బోనాల వేడుకలు**



గార్ల: గార్లలోని విశ్వశాంతి పాఠశాలలో మంగళవారం విద్యార్థులు విచిత్ర వేషధారణ ధరించి బోనాల పండుగ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పీఏసీఎస్ చైర్మన్ వల్లమూడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

**వైద్యం అందించాలి**

బయ్యారం: మండలంలో విషజ్వరాల బారిన పడిన ప్రజలకు వైద్యం అందించాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఎదుట ఆందోళన నిర్వహించారు. పీహెచ్‌సీకి వచ్చిన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు ఊకే పద్మ, తుడుం వీరభద్రం, మురళీకృష్ణ, భిక్షం, అనురాధ పాల్గొన్నారు.

## క్రైం కార్నర్..

**పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య**

గార్ల: పురుగుమందు తాగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం మద్దివంచ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం మద్దివంచ గ్రామానికి చెందిన చిర్ర నగేష్(35) మతిస్థిమితం సరిగా లేక ఉదయం పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు సంతానం. మృతుడి తమ్ముడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్ వెల్లడించారు.

**రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి**

తిరుమలాయపాలెం: మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బంగ్లాకు చెందిన సూరబోయిన రఘుపతి(50) ఖమ్మం జిల్లా తిరులాయపాలెం మండలం పిండిప్రోలులో పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన మంగళవారం మరిపెడ వెళ్లేందుకు బయలుదేరి ఇంకొకరి బైక్‌పై లిఫ్ట్ అడిగి మేకలతండా స్టేజీ వద్ద దిగాడు. అక్కడి నుంచి నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. రఘుపతికి భార్య, కుమార్తె ఉండగా ఆయన మృతదేహం వద్ద వారు కన్నీరుమున్నీరుగా విలపించారు.

**అనారోగ్యంతో ఉపాధ్యాయుడు..**

బయ్యారం: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన గంగావత్ రాజన్న(40) గంధంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు**

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం స్టేజీ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దనాగారం స్టేజీ సమీపంలో వరంగల్-ఖమ్మం హైవేను ద్విచక్ర వాహనంపై లింగమల్లు అనే వ్యక్తి దాటుతుండగా ఖమ్మం నుంచి వరంగల్‌కు వెళ్లే కారు ఢీకొనడంతో అతడి తలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి ఖమ్మం తరలించారు.


**అడవి పంది దాడిలో రైతుకు..**



గాయపడిన రైతు

కొత్తగూడ: అడవి పంది దాడిలో రైతుకు గాయాలైన ఘటన మండలంలోని రేణ్యాతండా శివారు చిన్నతండాలో వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. తండా సమీపంలోని బానోతు లచ్చుకు ఉన్న మొక్కజొన్న చేనులో భార్య కౌసల్యతో కలిసి ఎరువు వేస్తున్నాడు. అప్పటికే చేనులో తిష్ట వేసిన అడవి పంది ఒక్కసారిగా లచ్చుపై దాడి చేసింది. దాడిలో లచ్చు కిందపడిపోగా చేతిని కొరికింది. ఇది గమనించిన భార్య కౌసల్య అరుస్తూ చేతిలో ఉన్న డబ్బాతో చప్పుడు చేసింది. దీంతో పంది లచ్చును వదిలేసి కౌసల్య వైపునకు రావడంతో ఆమె కింద పడింది. కాగా లచ్చు చేతి వేలు చితికిపోగా.. కౌసల్యకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

# టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ 25వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంఘం సీనియర్ నాయకుడు బి.కృష్ణయూర్తి సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, ఆడిట్ కమిటీ సభ్యులు హరినాయక్, నాయకులు సంజీవ, శ్రీనివాస్, ప్రవీణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.